ఇచ్చిన మాట నిలుపుకోండి..



సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గతంలో అన్న మాట మేరకు ప్రతి ఏటా రైతు భరోసా సాయం ఇచ్చాడు. ఈసారి కూటమి అధికారంలోకి వచ్చాక రూ.20 వేలు పెట్టుబడి సాయం అందుతుందని ఆశించాం. రైతుకు చేయూత అందుతుందని అనుకున్నాం. అధికారం చేపట్టి వంద రోజులు గడుస్తున్నా పెట్టుబడి సాయం పైన ప్రభుత్వం నోరు మెదపడం లేదు. ఇస్తారో ? ఇవ్వరో అనే అనుమానం కలుగుతోంది.

– **గన్నమనేని సీతారెడ్డి**, కొప్పరపాలెం, బల్లికురవ మండలం

నిరుద్యోగ భృతి నాకు ఎంతో ఆసరా..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెంటనే నిరుద్యోగ భృతి వస్తుందని నేను చాలా సంతోషించా. కాని అది ఇంతవరకు వచ్చిన దాఖలాలే లేవు. నిరుద్యోగ భృతి వస్తే మాలాంటి నిరుద్యోగులకు ఎంతో ఉపయోగకరం. డిగ్రీ ఆయిపోయి 11 సంవత్సరాలు అవుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చి 3 నెలలు అవుతోంది. సూపర్–6పై ఎలాంటి స్పందన లేదు.

– **ఉన్నం గోపనాథ్**, పంగులూరు

గతంలో పీఎం కిసాన్, రైతు భరోసా ఒకేసారి అందేవి..



గత ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో పీఎం కిసాన్ రైతు భరోసా నగదు ఒకేసారి అందేవి. దీంతో పంట పెట్టుబడి కోసం ఎంతో ఉపయోగపడేది. ప్రస్తుతం ఖరీఫ్ సాగు సీజన్ సగాన పడినప్పటికీ ఇంతవరకు ప్రభుత్వం పెట్టుబడి సాయం ప్రకటించలేదు. ప్రభుత్వం వెంటనే రైతులకు సాయం అందించాలి.

– **రాఘవరావు**, రైతు, వేటపాలెం

రైతులంటే అంత అలుసా.. ?



ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా చాలా రోజులైంది. పంటల సాగుకు పెట్టుబడి ఇవ్వాలి. పెట్టుబడి ఇస్తే కొంతఊరట లభిస్తుంది. వర్షాలు పడుతున్నాయి.. సాగు చేసుకోవాలి. టీడీపీ నేతలు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామన్నారు. అతీగతీ లేదు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణమని చెప్పారు. ఇప్పటికీ ఆ ప్రస్తావనే లేదు. అధికారం చేపట్టాక హామీలను గాలికి వదిలేశారు.

– **ఎం.వసంతరావు**, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు





అంతా మోసం!

● మాటల బూచోడు–మాయల బాబు ● గ్యారెంటీ గోవిందా.. ష్యూరిటీ హాంఫట్ ● హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్

సాక్షి నెట్‌వర్క్: అబద్ధాలను కళ్లార్పకుండా మాట్లాడటంలో ఆయన ఒక వీరుడు. అందులో పీహెచ్‌డీ చేసిన వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడు. ప్రపంచంలో ఉన్న యూనివర్సిటీలన్నీ అబద్ధంలో పీహెచ్‌డీ చేసిన చంద్రబాబునాయుడుకు డాక్టరేట్ ఇవ్వడంలో అతిశయోక్తి లేదని చెప్పుకోవచ్చు. సీఎం అయిన తర్వాత సాక్షాత్తు అసెంబ్లీలో చంద్రబాబు మాట్లాడుతూ సూపర్ 6 హామీలు ఇచ్చాం.. ఇప్పుడు చూస్తే భయమేస్తుంది అని తన అలవాటైన మాటలతో మభ్యపెట్టాడు. దీనికి తోడు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సైతం వంత పాడాడు. అదే ఆయన స్థానంలో సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి ఉండి ఉంటే ఈపాటికి అనుకున్నది అనుకున్నట్లుగా లబ్ధిదారుల ఖాతాలో జమయ్యేవి. రైతు భరోసా, అమ్మఒడి తదితర పథకాలు ఎప్పుడు ఏ టైంలో ఇస్తామో చెప్పి చేసి ఇచ్చిన ఘనత ఒక్క మాజీ సీఎం జగన్‌కే దక్కుతుంది. ఈ మూడు నెలల్లో ఎంత విధ్వంసం జరిగిందో ప్రజలు గ్రహించారు. ఇప్పుడు మేమెందుకు ఓట్లు వేశామా ? అని తలలు పట్టుకుంటున్నారు.



ప్రతి ఇంటికీ 3 గ్యాస్ సిలిండర్లు

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

పర్చూరు	39,154
చీరాల	51403
అద్దంకి	46,400



యువతకు నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి

నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
పర్చూరు	33559	రూ.10.67
చీరాల	40000	రూ. 12.00
అద్దంకి	44,624	రూ. 13.38



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

పర్చూరు	1,20,000
చీరాల	1,50,000
అద్దంకి	1,28,258



ప్రతి మహిళకు నెలకు రూ.1500

నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
పర్చూరు	70769	రూ.10.61
చీరాల	81300	రూ. 12.34
అద్దంకి	71000	రూ. 10.65

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లులకు అందిన సాయం

పథకం : అమ్మఒడి

నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
పర్చూరు	24,450	రూ. 77.17
చీరాల	22000	రూ.33.00
అద్దంకి	23,366	రూ. 35.04



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

పథకం : తల్లికి వందనం

నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
పర్చూరు	48,900	రూ. 73.35
చీరాల	66000	రూ. 66.50
అద్దంకి	46,732	రూ. 70.09

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతుకు అందిన సాయం

పథకం : రైతుభరోసా

నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
పర్చూరు	72732	రూ. 98.18
చీరాల	19830	రూ. 26.77
అద్దంకి	44163	రూ. 59.62



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

పథకం : అన్నదాత

నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
పర్చూరు	72868	రూ. 145.73
చీరాల	55,830	రూ. 75.37
అద్దంకి	44,703	రూ. 89.40

హామీలన్నింటినీ అమలు చేయాలి..



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందుకు ప్రజలు ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే అమలు చేయాలి. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ఎన్నికల ముందు డాబు మాటలు చెప్పి అధికారం చేపట్టిన తర్వాత పథకాల అమలుపై మీనమేషాలు లెక్కిస్తోంది. ఇచ్చిన హామీలను నెరవేర్చి చిత్తశుద్ధిని నిలబెట్టుకోవాలి. ప్రజాస్వామ్యబద్ధంగా పాలించాలి.

– **ఎన్.బాబూరావు**, సీఐటీయూ కార్యదర్శి, చీరాల

రూ.1500 ఎప్పుడిస్తారో చెప్పాలి..



ఎన్నికలకు ముందు అది ఇస్తాం. ఇది ఇస్తాం అని చెప్పారు. తీరా అధికారం చేపట్టిన తరువాత ఏ పథకాన్ని అమలు చేయలేదు. నెలా నెలా మహిళలకు రూ.1500 ఇస్తామన్నారు. అధికారం చేపట్టి నెల గడుస్తున్నా ఆ ఊసే లేదు. గతంలో జగన్ మోహన్‌రెడ్డి ఇది ఇస్తానని చెప్తే క్యాలెండర్ ప్రకారం చెప్పి పంపిణీ చేశాడు. ఇప్పుడా చిత్తశుద్ధి ఏది. అసలు ఇస్తారో లేదో అనే అనుమానం కలుగుతోంది.

–**షేక్ అబీదా**, అద్దంకి

ఇచ్చిన వాగ్దానం ఎటు వెళ్లిందో..



చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నాడు. లేదా ఉద్యోగం వచ్చే వరకు ప్రతి ఒక్కరికి నెలకు రూ. 3,000 నిరుద్యోగ భృతి ఇస్తానని వాగ్దానం చేశాడు. ఆయన ఇచ్చిన మాట మేరకు నాలాంటి నిరుద్యోగులకు వెంటనే నిరుద్యోగ భృతి అందించి ఆదుకోవాలి.

– **శవనం అనిల్**, నిరుద్యోగి, చీరాల

అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది..



ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సాయం అందకపోవడంతో పంటలు సాగు చేసేందుకు రైతులు ఇతరుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు రైతుల ఖాతాల్లో జమచేయాలి. పెట్టుబడి సాయం అందిస్తే రైతులకు కొంత మేర వెసులుబాటు కలుగుతుంది.

–**రామకృష్ణ**, రైతు, చీరాల

క్లుప్తంగా...

గ్యాస్ స్టవ్ నుంచి చెలరేగిన మంటలు

అద్దంకి రూరల్: పానీపూరి తయారు చేస్తుండగా ఒక ఇంట్లో గ్యాస్ స్టవ్ నుంచి మంటలు చెలరేగాయి. ఈ సంఘటన బుధవారం పట్టణంలో జరిగింది. అందిన వివరాల ప్రకారం.. స్థానిక ఎల్ఈఎఫ్ నగర్‌లో నివాసం ఉంటున్న ముఖేష్ కుమార్ పానీపూరి బండి ద్వారా జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం అతని భార్య సంగీత ఇంట్లో స్టవ్ మీద పానీపూరీ తయారు చేస్తుండగా స్టవ్ నుంచి మంటలు చెలరేగాయి.

40 మద్యం బాటిళ్లు స్వాధీనం

చినగంజాం: అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం బాటిళ్లను బుధవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రమేష్ అందించిన సమాచారం ప్రకారం.. మండలంలోని చింతగుంపల గ్రామానికి చెందిన చేగుడి విజయ్ కుమార్ బుధవారం రాత్రి మున్నవారిపాలెం మద్యం షాపు నుంచి 40 మద్యం బాటిళ్ళను తరలిస్తుండగా సిబ్బంది పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హైస్కూల్‌లో బోర్ ఏర్పాటు

చీరాల రూరల్: ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్ సభ్యులు మాదల చిన సుబ్బారావు ఆర్థిక సహకారంతో రూ. 11,000 విలువైన మంచినీటి బోరింగ్ పంపును ఎస్ఆర్అండ్ పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో బుధవారం ఏర్పాటు చేశారు. అలానే గోవుల ఆహార నిమిత్తం శ్రీకృష్ణ గోశాల నిర్వాహకులకు మరో రూ. 1,500 విరాళం అందజేశారు.

చీరాలలో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలి

చీరాల: బాపట్ల పార్లమెంటరీ పరిధిలోని చీరాల నియోజకవర్గంలో ఐటీ హబ్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరినట్లు బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మంత్రి నారా లోకేష్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బాపట్ల పార్లమెంటరీ పరిధిలో చీరాలలో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు.

తక్కువ ఖర్చుతో పోషకాహారం సాధ్యం

చీరాల అర్బన్: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి కె.ఉమ అన్నారు. పోష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం అర్బన్‌లోని సాయిబాబా గుడి అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు.

గోవులకు మేత వితరణ

అద్దంకి: పట్టణంలోని హరిహర గోశాలలోని గోవులకు రోటరీ సభ్యుల సౌజన్యంతో బుధవారం మేతను అందజేశారు. రూ.20 వేల విలువ చేసే పశుగ్రాసం (వరిగడ్డి) నిర్వాహకుడు సుబ్బారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గాడేపల్లి దివాకరదత్తు మాట్లాడుతూ పురాతన కాలం నుంచి మన సమాజంలో మనిషికి పశువుకి అవినాభావ సంబంధం ఉందన్నారు. పశువుల పెంపకం అనేది మన జీవన విధానంలో ఒక భాగం అన్నారు, ప్రత్యేకంగా ఆవుకి ఎంతో ప్రాముఖ్యత ఉందని, అటువంటి ఆవుల సంపదని మనం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. గోశాలకు రోటరీ తరఫున గతంలో కూడా తవుడు దాణా ఇచ్చామని, ఈ రోజు ట్రక్ వరిగడ్డి రోటరీ మిత్రుల సౌజన్యంతో ఇస్తున్నామని రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. సెక్రటరీ చుండూరి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, సంకా సుబ్రహ్మణ్యం (బాబు) గుళ్లపల్లి సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి దాతల చేయూత అభినందనీయం

బల్లికురవ: స్థానిక భవిత కేంద్రానికి దాతలు చేయూత ఇవ్వడం అభినందనీయమని ఎంఈఓ వస్త్రం నాయక్ అన్నారు. బుధవారం వైకల్యం కలిగిన ఏడుగురు చిన్నారులకు జరిగిన ఫిజియోథెరపీ పరీక్షలు, రికార్డులను ఆయన పరిశీలించి సంతృప్తి చెందారు. అద్దంకికి చెందిన చెన్నుపల్లి అంజయ్య వెంకటరత్నం దంపతులు సుమారు 8 వేల రూపాయలు విలువ చేసే ట్రామ్పోలిన సెట్టు, ఆదిత్య ఐదు కుర్చీలను బహూకరించారు. సాధారణ పిల్లలతో సమానంగా పెంచాలని, మంచి పౌష్టికాహారం అందించాలని వైకల్య చిన్నారుల తల్లిదండ్రులను ఎంఈఓ కోరారు. పరీక్షల్లో ఫిజియోథెరపిస్ట్ ఇందిరా ప్రియదర్శిని, ఐఈఆర్టీలు నాగబాబు, నాజిలి పాల్గొన్నారు. భవిత కేంద్రానికి ఎంఈఓ చేతుల మీదుగా ట్యాబ్స్ అందజేశారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు రక్త పరీక్షలు

స్వర్ణ (కారంచేడు): ఎన్‌సీసీ క్యాడెట్లుగా ఉన్న ప్రతి విద్యార్థికి రక్త పరీక్షలు నిర్వహించారు. బుధవారం స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎన్‌సీసీ క్యాడెట్లకు స్వర్ణ పీహెచ్‌సీలోని ల్యాబ్ టెక్నీషియన్, ఎంఎల్‌హెచ్‌పీలు పరీక్షలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం నూతనంగా ఎన్‌సీసీలో జాయిన్ అయ్యే విద్యార్థులకు తప్పకుండా ఈ పరీక్షలు చేయిస్తామన్నారు. హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్ష కేంద్రంలో ఎల్‌టీ బయ్యా శంకర్, పీడీ కె. ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట నమోదుకు 23 తుది గడువు

మార్టూరు: ఖరీఫ్ సీజన్‌లో పంటల నమోదుకు సెప్టెంబర్ 23వ తేదీతో గడువు ముగియనున్నట్లు మండల వ్యవసాయ అధికారి వి. కిరణ్ కుమార్ తెలిపారు. ద్రోణాదుల, నాగరాజు పల్లి గ్రామాల్లో బుధవారం పంటల నమోదు పరిశీలించిన అనంతరం స్థానిక రైతులతో మాట్లాడారు. ఇంతవరకు మండలంలో సాగు చేస్తున్న మొత్తం 4700 ఎకరాలకు గాను 4610 ఎకరాలు పైరు నమోదు చేశామని మిగిలిన రైతులు ఈనెల 23వ లోపు స్థానిక రైతు సేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు. నారుమడుల్లో పొటాష్.. జింకు లోపాలను గుర్తించినట్లు తెలిపారు.

తరగతులు సద్వినియోగం చేసుకోండి

యద్దనపూడి: పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ తరగతులు నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. అడ్మిషన్‌లు ముగియనున్న దృష్ట్యా ఆసక్తి గలవారు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

బస్సును ఢీకొన్న ట్రాక్టర్

మేదరమెట్ల: ఆగి ఉన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఈ సంఘటన మేదరమెట్ల దక్షిణ బైపాస్ ప్రాంతంలో బుధవారం జరిగింది. బెంగళూరు నుంచి విజయవాడకు వెళ్తున్న శ్రీవెంకట రమణ ట్రావెల్స్ బస్సు మరమ్మతుల కోసం రోడ్డు మార్జిన్‌లో నిలిచి ఉంది. అదే సమయంలో గ్రానైట్ రాళ్ల ముక్కల లోడుతో మేదరమెట్ల వైపు వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి ఆగి ఉన్న బస్సును ఢీకొంది.

ఓజోన్ పరిరక్షణ అందరి బాధ్యత

చీరాల అర్బన్: ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీ శాస్త్ర సాంకేతిక మండలి బాపట్ల జిల్లా కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, ప్రధానోపాధ్యాయుడు పి.పూర్ణచంద్రరావు అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో బుధవారం జాండ్రపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పర్యావరణంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు.

వేటపాలెం: ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరూ గుర్తించాలని హెచ్ఎం గుమ్మా శ్రీనివాసరావు అన్నారు. కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన నాగరత్నం మాట్లాడుతూ ఓజోన్ పొర వాహనాల నుంచి వెలువడే కోరో పోరో కార్బన్ తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు.

న్యాయవాదుల చేయూత

చీరాల రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కకావికలమైన లంక గ్రామాల్లోని పశుపోషకులకు చీరాల న్యాయవాదులు అండగా నిలిచారు. న్యాయవాదులు తమవంతు కర్తవ్యంగా భావించి తలా చేయివేసి రూ. 25,000 విలువైన ట్రాక్టర్ వరిగడ్డిని కొనుగోలుచేసి వరద ప్రభావిత లంకల గ్రామమైన తోకవారిపాలెంకు బుధవారం తరలించి అందజేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కారంచేడు: ఇంటి పరిసరాల పరిశుభ్రతకు అంతా కృషి చేయాలని ఎంపీడీఓ పి. లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం స్వర్ణపాలెంలో అవగాహన ర్యాలీలో గ్రామస్తులతో మాట్లాడారు.

జీవాల పెంపకంలో జాగ్రత్తగా ఉండాలి

చీరాల టౌన్: పాడి పశువుల పెంపకంలో, జీవాల ఆరోగ్యం పట్ల పశుపోషకులు జాగ్రత్తగా ఉండటం వలన జీవాలకు సీజనల్ వ్యాధులు దరిచేరవని ఈపురుపాలెం పశువైద్యురాలు పావని అన్నారు. బుధవారం మండలంలోని బోయినవారిపాలెంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. బుధవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ప్రజలకు కావాల్సిన అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

విద్యార్థులకు పురస్కారాల అందజేత

చీరాల రూరల్: దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియెట్ బోర్డు నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో దాత రిటైర్డు లైబ్రేరియన్ పుల్లగూర జయశీలరావు తండ్రి పుల్లగూర జయరావు, సలగల ఇశ్రాయేలు జ్ఞాపకార్థం నగదు పురస్కారాలు అందజేశారు. సభలో దాత పుల్లగూర జయశీలరావు మాట్లాడారు. పిల్లలు.. తల్లిదండ్రుల ప్రేమకు ప్రతిరూపాలని, అటువంటి పిల్లలు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉండాలని చెప్పారు. ఎంపీసీలో మొదటి స్థానంలో ఐశ్వర్య, ద్వితీయ స్థానంలో థెరిస్సా, సీఈసీలో మొదటి స్థానంలో రాజేష్, ద్వితీయ స్థానంలో వెంకట సాయిలు నిలవగా ఉత్తమ నగదు పురస్కారాలు అందించారు. కార్యక్రమానికి ముందుగా స్థానిక చర్చి పాస్టర్ రెవరెండ్ పిల్లి దేవదాసు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యా సాగరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు, దేవదానం, రిటైర్డు ప్రిన్సిపాల్ గోళ్ల ఎజ్రా, రిటైర్డు పీడీ డీసీ విద్యాసాగర్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు పురస్కారం అందిస్తున్న రెవరెండ్